# భయం

-భీమవరపు పురుషోత్తం

రాత్రి పదకొండయింది. టీవీలో చంద్రముఖి సినిమా వస్తోంది. ఇంటి చుట్టూ నిర్మానుష్యం. ఇంటినానుకొని రావిచెట్టు ఒకటి గాలికి తలలూపుతోంది. ఫల్గుణరావు కుర్చీలో బిగుసుకుపోయి కూర్చున్నాడు. 'వారాయి...' అని పాడుతోంది గంగ. ఎంత కంట్రోల్ చేసుకున్నా భయం చుట్టుముట్టింది. 'లకలక'మని గంగ అరుస్తుంటే ఆ రూపం చూసి జడుసుకున్నాడు. రెండుమూడుసార్లు గుండెలనిండా ఊపిరి పీల్చి వదిలాడు.

ఇంట్లో ఎవ్వరూ లేరు. నిశ్శబ్దంగా వుంది. వనజ డెలివరీకి పుట్టింటికి వెళ్లింది. చవగ్గా వచ్చిందని ఆ ఇల్లు కొన్నాడు ఫల్గుణరావు. చుట్టూ దగ్గరగా ఇళ్లులేవు. కాస్తంత దూరంలో ఉన్నాయి విసిరేసినట్టు.

సిన్మా పూర్తయ్యింది. ఫల్గుణరావు తలుపు తీసి వీధి వరండాలోకి వచ్చి నిల్చున్నాడు. సిగరెట్ తీసి వెలిగించాడు. అంతా చీకటి. అక్కడక్కడ వీధి దీపాలు వెలుగుతున్నాయి. నాలుగు దమ్ములు వదిలి పైకి చూశాడు. రావిచెట్టు ఆకులు గలగల లాడించింది.

మనసులో ఏదో దడ పుట్టింది. కూతవేటు దూరంలో అతని ఫ్రెండు సుందర్రావు ఇల్లుంది. వెళ్లి బయటికి పిలుద్దామనుకున్నాడు. ఎందుకులే మళ్లీ అర్థరాత్రి అనుకొని ఆగిపోయాడు.

గాలి ఏదో విసిరికొట్టింది. సిగరెట్ నుసి ఎగిరింది. లోపలికి వెళ్లి తలుపేసుకున్నాడు. అతనింటి పక్కన రేకులషెడ్డులో ఆ కాలనీ గూర్ఖా కాపురముంటున్నాడు. ఎందుకో వాళ్ల అలికిడి వినిపించలేదీరోజు.

తలుపులన్నీ వేసుకుని ఇంట్లోకి వెళ్లి దుప్పటి ముసుగెట్టి నిద్రపోవటానికి ప్రయత్నించాడు. సినిమా ప్రభావం అతడిమీద చూపిస్తుంది. రోజులా ప్రశాంతంగా నిద్ర రావట్లేదు. రాజుగారి ఆస్థాన నర్తకి చనిపోయి భయానక ప్రేతాత్మగా మారటం, గంగని ఆవహించటం, ఆపై చిత్ర విచిత్ర భయానక చేష్టలు... అన్నీ గుర్తుకొస్తున్నాయి. అటు పొర్లి ఇటు పొర్లి చివరకు మగత నిద్రలోకి జారుకున్నాడు. అర్థరాత్రి 'ఘల్లుఘల్లు'మని వినిపించింది.

నిద్రాభంగమయి కళ్లు తెరిచాడు. అసలేమీ అర్థం కాలేదు. కళ్లు మూసుకున్నాడు ఓ పక్కకి వొరిగి 'ఘల్లుఘల్లు'మంటూ మళ్లీ శబ్దం!

దిగ్గున లేచి కూర్చున్నాడు. భయంతో నోట మాట రాలేదు. సినిమా, గంగ పాత్ర కళ్లముందు కదలాడింది. గొంతు తడారిపోయింది...

చటుక్కున లేచి లైటు వేసాడు. గుండె లబ్‌డబ్‌మంటూ కొట్టుకుంటోంది. సమయం ఒంటిగంటయింది. ఇళ్లంతా లైట్లు వేసేసి శబ్దం ఎక్కడి నుండి వస్తుందా అని అణువణువునా గాలించాడు. లోపల ఏం లేదు! మళ్లీ లైట్లార్పి పడుకున్నాడు. బెడ్‌రూంలో లైటు ఒక్కటి ఉంచుకున్నాడు. ఈసారి హాల్లో ఎవరో 'ఘళ్ళు ఘళ్ళు'మని పరిగెత్తిపోతున్నట్టు వినిపించింది. బాణంలా లేచి హాల్లో లైటు వేశాడు. ఏం లేదక్కడ!! చొక్కా చెమటతో తడిసిపోయిందతడికి. ఎప్పుడూ ఇలా జరగలేదు. అసలా శబ్దం ఏంటి? ఏదైనా దయ్యమా? గంగలా నవ్వుతుందా ఇప్పుడు! ఆలోచనలతో తల వేడెక్కిపోయింది. ఇంట్లో లైట్లన్నీ వేసేసి రాత్రంతా అలాగే కాపలా కూర్చున్నాడు. తలుపులు తీసి బయటికి వెళ్లాలంటేనే భయం వేసింది. అతను ఒకచోట ఉంటే మరో చోటనుంచి గజ్జెల శబ్దం వచ్చేది. అక్కడికి వెళ్లితే ఏం ఉండేది కాదు... శబ్దానికి ఓ వరసంటూ లేదు. చిత్తం వచ్చినట్టు ఆగి ఆగి వినిపిస్తుంది. తెల్లవారింది. ఏ ఆధారము దొరకలేదు. మనిషంతా భయంతో బిక్కచచ్చిపోయాడు. ఉదయమే సుందర్రావుని కల్సుకొని అంతా వివరించాడు.

"చాలా వింతగా వుందే, నాకు కూడా ఇలాంటి అనుభవాలు కొన్ని ఎదురయ్యాయి. ఒకసారి మా ఇంటి తలుపులు దబదబ అదిరాయి. వంటింట్లో గిన్నెలు ఛళ్ళున కిందపడ్డాయి. కిటికీలు ఎవరో బయటనుండి మూసినట్టు ఠపాలున మూసుకొనేవి. ఇదంతా దయ్యం పనేనంటావా?" కళ్ల తేలవేసాడు.

ఫల్గుణరావుకి దెయ్యమే అని గురి కుదిరింది. సొంత ఇల్లు, అద్దె ఇల్లయితే ఖాళీ చేసిపోవచ్చు. బోలెడు డబ్బుపోసి కొన్నాడు. ఇప్పుడెలారా దేవుడా అనుకుంటూ ఆలోచనల్లో పడిపోయాడు. పగలు ఆ ప్రాంతం కాస్త సందడిగానే ఉంటుంది. వెనక పెద్ద రోడ్డు ఉండటం వల్ల వాహనాలు 'రయ్ రయ్' మంటూ తిరుగుతూనే ఉంటాయి. కాలనీలో కూడా జనసంచారం బాగా ఉంటుంది. రాత్రయితే మాత్రం జనం పల్చబడి నిర్మానుష్యంగా ఉంటుంది.

* * *

సుందర్రావు, ఫల్గుణరావు కాలనీలో దగ్గరగా ఉన్న ఇళ్లన్నీ తిరిగి ఇలాంటి భయానక సమాచారం కొంత సేకరించారు. కొంతమంది అసలు తమకేం తెలీదన్నారు. కొందరు ఏవో చిన్న చిన్న అనుభవాలు అయ్యాయి కానీ అంతగా పట్టించుకోలేదని చెప్పారు.

ఎటొచ్చీ తన అనుభవమే దారుణంగా ఉందనిపించింది ఫల్గుణరావుకి. దెయ్యం తనమీద తన ఇంటిమీద బాగా పగబట్టిందని నిర్ధారించుకొన్నాడు. అది ఎలాంటి దెయ్యం? కోరికలు తీరక ఇంట్లో మనుషుల్ని పీడించుకుని తినే ఆత్మలాంటిదా? లేకపోతే శాకినీ, ఢాకినీ..లాంటి పిశాచమా? ఆలోచించడానికే వొళ్లు జలదరించింది. గుండెలు పీచుపీచుమన్నాయి. మర్నాటి రాత్రి సుందర్రావు ఇంట్లో పడుకున్నాడు. ఊరినుండి భావమరిది సత్యాన్ని పిలిపించి ఆ మర్నాడు ఇద్దరూ కల్సి పడుకున్నారు. చిత్రంగా ఆరోజు

శబ్దాలేవీ రాలేదు. ఆ తర్వాతిరోజూ రాలేదు. అంతా ప్రశాంతంగా వుంది. హమ్మయ్య అనుకున్నారు.

"ఏంటీ బావా మరీ చిన్న పిల్లాడిలా ఈ మాత్రానికే ఇలా ఇదయిపోతే ఎలా? నేను చూడు ఎంత ధైర్యంగా ఉన్నానో ఎంత ఉల్లాసంగా వున్నానో..." అంటూ కాలేజీ చదివే సత్యం బావని బాగా ఆటపట్టించాడు.

"సరే బాబూ! ఒకసారి అనుభం అయితేగానీ ఏదీ తెలీదు. చూద్దాంగా... దెయ్యం లేకపోతే అందరికీ మంచిదేగా?" అన్నాడు ఫల్గుణరావు.

అతడికి అక్కసుగా వుంది బావమరిది మాటలకు.

"దయ్యమా! గాడిదగుడ్డా, ఈరోజుల్లో దెయ్యాలు భూతాలు నమ్మే సత్తెకాలం మనిషివి నిన్నే చూస్తున్నాను బావా!" అన్నాడు వెటకారంగా. అతడో కొంటెకోణంగి. బావను ఆటపట్టించడమంటే భలే సరదా అతడికి.ఆ రాత్రి ఇద్దరూ నిద్రలోకి జారుకున్నారు.

అర్థరాత్రి దాటింది. ఎక్కడో ఏదో కుక్క 'కుంయ్యో'మని అరుస్తోంది.



కాలనీ చీకటిలో బిక్కు బిక్కుమంటూ నిద్రపోతుంది. ఎక్కడా జనసంచారం లేదు. ఏవో చిన్న చిన్న శబ్దాలు తప్ప అంతా గాఢ నిశ్శబ్దం... చెట్టు కొమ్మలు గాలికి కదలటం పిట్టలు నిద్రాభంగమయి రెక్కలల్లార్చటం తప్ప!

ఉన్నట్టుండి 'ఘల్లు'మంది!

తుళ్ళిపడి లేచాడు సత్యం. పక్కన బావ తను ఉన్నాడన్న ధైర్యంతో కాబోలు సుఖనిద్రలో ఉన్నాడు.

తను విన్నది కరెక్టేనా అనుకునేలోపు మళ్లీ 'ఘల్లు ఘల్లు'మంది క్లియర్‌గా. స్ప్రింగులా లేచి కూర్చున్నాడు. బావను లేపుదామంటే నామోషీ. గుండెవేగం పెరగటం తెలుస్తుంది.

మంచం దిగి గదిలో లైటు వెలిగించాడు. ఎవరూ కనిపించలేదు. హాల్లోకి వచ్చాడు. లైటువేసి కలియజూసాడు... నిశ్చేష్టుడయాడు ఎదురుగా చూసి!పెద్ద తలుపు తెరచి ఉంది. అప్పుడే ఎవరో బయటికి వెళ్లినట్టు కిర్రుమని కదలుతోంది. వణుకు వచ్చింది. బయట చీకటి, బావను లేపాలంటే ప్రెస్టేజీగా ప్రగల్భాలు పలికేడాయె. ఇప్పుడెలా? గుండె దిటవు చేసుకుని బయటికి వచ్చి చూశాడు. ఓ మూలగా చిన్న బెడ్ బల్బు పైకప్పుకి వేళ్లాడుతూ చీకటిని పారద్రోలటానికి విఫలయత్నం చేస్తుంది. అంతా నిర్మానుష్యం. తలుపు ఎవరు తెరిచారు అనుకొంటూ శబ్దం ఏదో అవుతుంటే పైకి చూశాడు. రావి ఆకులు గలగలకొట్టుకుంటున్నాయి బుసలు కొడుతున్నట్టు. ఏదో నీడలా ఆకారంపైన చెట్టుపై కదలటం గమనించేడు! అంతే! గుండాగిపోయింది...కెవ్వున అర్చి కుప్పకూలిపోయాడు.

## ఇది కథ కాదు

అహ్మదాబాదుకు చెందిన ఆమె, అతను చాలా యేళ్ళు ప్రేమించుకున్నారు. అతని పెద్దలు ఒప్పుకోకపోవటం వల్ల వాళ్ల పెళ్లి కాలేదు. మరొకామెతో అతని పెళ్లి జరిగిపోయింది. ముగ్గురి పిల్లల్ని కన్నాక గుండెపోటు వచ్చి అతని భార్య హఠాత్తుగా చనిపోయింది. తల్లిలేని ఆ పిల్లల్ని సాకాలని ఆమె అతని రెండవ భార్యగా వచ్చింది. ఆమెను అతని బంధువులు సుఖంగా బ్రతకనివ్వలేదు. మాటలతో హింసించసాగారు. రెండేళ్లు ఎలాగో ఓర్చుకుంది. ఆపై భరించలేక అతని జీవితంనుంచి తప్పుకోవాలనుకుంది. ఇద్దరూ రాజీపడి విడాకులు తీసుకున్నారు. అయితే, భర్త పిల్లలు ఆడదిక్కు లేకుండా బ్రతకటం ఆమె చూడలేకపోయింది. నెల తిరక్కుండా అతనికి మరో పెళ్లి చేయాలని పెళ్లి కూతురుకోసం తనే మేరేజి బ్యూరోలవెంట తిరగసాగింది!

## అమెరికాలో సైకిళ్ళు

ఇన్నాళ్లూ సైకిళ్లని ఎక్కువగా వాడే చైనీస్‌ని, ఇండియన్స్‌ని అమెరికన్లు చులకనగా చూసేవాళ్లు. ఈ మధ్య అమెరికాలో పెట్రోలు ధరలు మండిపోతున్న నేపథ్యంలో జనాలు తక్కువ దూరాలకు సైకిళ్లమీద వెళ్లటం అలవాటు చేసుకున్నారుట. ఇటీవల సైకిలు సేల్సు విపరీతంగా జరుగుతున్నాయిట!

-తటవర్తి




★ ★ ★

మళ్లీ కళ్లు తెర్చేసరికి హాస్పిటల్ పడుకుని ఉన్నాడు.

“ఏమయ్యా బామ్మర్దీ! ఎన్ని కబుర్లు చెప్పావ్. యూత్ అన్నావు అదన్నావు ఇదన్నావు. చివరికేంటి స్వామీ ఇలా కళ్లు తేలేసేవు? ఇప్పటికైనా వొప్పుకుంటావా దెయ్యం అందరికన్నా పవర్‌ఫుల్ అని” అన్నాడు ఫల్గుణరావు. సత్యం సిగ్గేసిపోయి నీరసం నెపంతో అలాగే కళ్లు మూసుకొని పడుకున్నాడు. ఫల్గుణరావు నవ్వుకొని బయటకు వచ్చేశాడు.

సాయంత్రం భూతవైద్యుణ్ని తీసుకొచ్చారు ఫల్గుణరావు, సుందర్రావు. భూతాన్నన్నా వదిలించాలి ఇల్లయినా అమ్మేయాలి అని నిశ్చయించుకున్నాడు ఫల్గుణరావు. భూతవైద్యుడు ఇల్లంతా వాసన చూశాడు కుక్కలా.

“వాసన కొడుతుందిగా...' అన్నాడు మెరిసే కళ్లతో.

“ఏం వాసన ఎలక చచ్చిన వాసనా?”

“కాదు అదో వాసన. శవం కాలుతోన్న వాసన. అదొస్తే దెయ్యం తిష్టవేసి కూర్చున్నట్టే” వీపున ఎవరో ఛెళ్లున కొట్టినట్టు ఉలిక్కిపడ్డారిద్దరూ.

“దెయ్యం ఇక్కణ్ణుంచి కదలదా స్వామీ...అయినా ఇన్నేళ్ళనుండీ లేనిది ఇప్పుడొచ్చిందేంటి ఈ దెయ్యం!” అన్నాడు ఫల్గుణరావు తెల్లబోతూ.

“దానికీ ఘడియలుంటాయి. నీ ఇష్టం వచ్చినప్పుడు పిలిస్తే రాదది. దాని ఘడియ, ఘటన వచ్చినప్పుడు మాత్రమే బయటపడుతుంది....ఇప్పుడొచ్చింది దానికి ఘటన” కళ్లెర్రజేశాడు భూతవైద్యుడు తనే ఓ భూతంలా మారి.

“సరే సరే .. ముందు వదిలించుకొనే మార్గం చెప్పండి” అన్నాడు సుందర్రావు వైద్యుడ్ని శాంతింపచేస్తూ.

“చెబుతా చెబుతా ముందు పదివేలు నా ఎడం చేతిలో పెట్టి 'మమ' అనుకోండి!” అన్నాడు.

ఫల్గుణరావు ఏడుస్తూ పదివేలు సమర్పించుకున్నాడు.

భూతవైద్యుడు డబ్బు అందగానే “క్లీం క్లాం శాకినీ....” అంటూ ఇల్లెగిరిపోయేలా అర్చాడు. ఆ అరుపుకి ఇంట్లో బల్లులు, పురుగులు ఉలిక్కిపడి స్థానభ్రంశం చెందాయి. మిత్రులిద్దరూ చెవులు మూసుకున్నారు.

పూజలు ప్రారంభమయ్యాయి. దాదాపు ముప్పైవేలు చేతి చమురు వదిలిపోయింది. గజ్జెల శబ్దం మాత్రం షరా మామూలే. రోజులు గడుస్తున్నాయి. దెయ్యం ఆచూకి దొరకలేదు. భూతవైద్యుడు రెట్టించిన ఉత్సాహంతో ఇంకా పూజలు చెయ్యాలంటాడు.

ఫల్గుణరావుకి ఓపిక నశించింది. ఇల్లు అమ్మేయాలని తీర్మానించాడు. బ్రోకర్‌కి చెప్పి ఇల్లు బేరం పెట్టాడు. ఐదుకి, ఆరుకి అడుగుతున్నారు ఆ ఇల్లు. ఫల్గుణరావుకి ఏడుపు వచ్చినంత పనయ్యింది.

అతడు పన్నెండు లక్షలకు కొన్నాడా ఇల్లు. అప్పుడే చవగ్గా దొరికిందన్నారంతా. ఎందుకు దొరికిందో ఇప్పుడర్థమవుతుంది అతడికి. దెయ్యం సంగతి తెలిసి కొనడానికి ఎవరూ ముందుకి రావటం లేదు.

వచ్చినా చవగ్గా అడుగుతున్నారు. ఏదోలా ఆ ఇల్లు వదిలించుకోవటమే మంచిదనిపించింది. చివరికి ఏడు లక్షలకు బేరం కుదిరింది. ఆ కాలనీవాళ్లే ఒకళ్లు కొనడానికి సిద్ధపడ్డారు. ఓ రాత్రి ఫల్గుణరావు సుందర్రావు, ఇల్లుకొనే వాళ్ల ఇంటికి వెళ్లి మాట్లాడి వస్తున్నారు. "రా, మా ఇంట్లో పడుకుందువు గానీ..." పిలిచాడు సుందర్రావు.

"ఇవాల్టికి వద్దులే మీకూ బంధువులెవరో వచ్చినట్టున్నారుగా, మా ఇంటి వరండాలో పడుకుంటాలే!" అని ఇంట్లోకి వెళ్లి మడతమంచం తెచ్చి బయట చల్లగాలికి వాల్చుకొన్నాడు.

కాళ్ళు చేతులు కడుక్కొని ఇంటిబెడద దెయ్యం బెడద వదిలిపోతుంది కదా అన్న భరోసాతో తృప్తిగా నడుం వాల్చాడు. ఇంతమంచి సువిశాలమైన ఇల్లు వదలాలంటే అతడికి కూడా మనసులో బెంగగానే వుంది.

గజ్జెల శబ్దం తప్ప ఇప్పటివరకూ దెయ్యం తనకు తానుగా బయటపడిం దేమీ లేదు! ఎవర్నేం చేసిందేమీ లేదు...

అసలా శబ్దం ఏంటో తెలిసే బావుండు అనుకుంటూ ఉండగా, చెట్టు ఆకులు గాలికి గలగలలాడుతుంటే నిద్రపట్టేసింది అతడికి. ఉన్నట్టుండి ఏదో 'ఘల్లు ఘల్లు'మని మోగుతుంటే లేచి వాచీ చూశాడు.

రాత్రి పన్నెండున్నర అయింది. అదే శబ్దం అనుకొంటూ లేచి తిరు గుతూ రావిచెట్టు వైపు గోడవారగా వచ్చి చూశాడు.

"నమస్తే సాబ్!" అంటూ గూర్ఖా పలకరించాడు. రావిచెట్టు కింద సిమెంటు చప్టా మధ్య ఉన్న చేతిపంపుతో బక్కెట్టులో నీళ్లు పట్టుకుంటు న్నాడు.

"నువ్వా! కనిపించటం లేదేమయ్యా ఈమధ్య" అన్నాడు విస్తుపోయి చూస్తూ.

"నేపాల్ వెళ్లా సార్, మా నాన్నకి సుస్తీ చేస్తే. నేను నా భార్య పిల్లవాడు అంతా వెళ్లిపోయాం. ఇక్కడ నా తమ్ముడే పెళ్లాంతో సహా ఉండి సూస్కుం టున్నాడు డ్యూటీ గట్రా. అమ్మగారికి డెలివరీ అయ్యిందా సాబ్?"

"లేదు. ఇంకా నాలుగురోజులుంది డాక్టరిచ్చిన డేటు" అని అదిరిప డ్డాడు.

"ఏమయింది సాబ్!"

"ఆ పంపుకి ఏంటది అలా చుట్టారు?" అన్నాడు కళ్లు విప్పార్చి చూస్తూ.

అతని ముఖాకృతికి గూర్ఖా భయపడి, "ఏముంది సాబ్... ఈ హ్యాండిలు చివర లూజయితే ఎక్కడిదో ఈ ఇనుపతీగ నేనే చుట్టా నెలక్రితం. లేదంటే గ్రిప్పు సరిగా ఉండటంలే సాబ్. నీళ్లు బాగా రావాలిగా మరి. ఈ తీగకేవో రేకుబిళ్లలున్నాయి. తీయటం కుదరక అలాగే ఉంచేశాను" అన్నాడు.

ఆ పంపు కొడుతుంటే తీగకున్న మందపాటి రేకుబిళ్లలు గలగల్లాడి అచ్చం గజ్జెల శబ్దంలా వినిపిస్తోంది! ఫల్గుణరావుకి నవ్వాలో ఏడవాలో తెలీ లేదు. సరిగ్గా చెట్టూ ఆ కింద పంపు ఇంటిని ఆనుకొనే ఉండటం వల్ల, ఎవ రైనా నీళ్లకోసం పంపుకొడితే రేకుబిళ్లల శబ్దం ఇంట్లో గజ్జెల శబ్దంలా ప్రతిధ్వ నిస్తోంది.

తన తొందరపాటుతనానికి, భయానికి అతడికి చెప్పలేనంత సిగ్గేసింది. ఇక జరిగిన సంఘటనలన్నీ... పెద్ద తలుపువేయటం మర్చిపోవటం, చీకట్లో సత్యానికి చెట్టుపై ఆకారంలా కన్పించడం, సుందర్రావింట్లో పిల్లలు సామాను పడగొట్టటం, గాలికి కిటికీ తలుపులు కొట్టుకోవటం లాంటివి భయమనే పునాది మీద నిర్మితమైన ఆకాశహర్మ్యాలే అని అర్థం అయ్యింది.

సిగ్గు విడ్చి గూర్ఖాకి జరిగినదంతా చెప్పాడు.

"అరె సాబ్! అంత గడబిడ జరిగిందా! ఈ పంపువల్లే ఇదంతా! మా తమ్ముడు సరిగా డ్యూటీ చేయడు సాబ్. కుర్రతనం బాగా జాస్తి. ఒకోసారి డ్యూటీకి పోడు. వాడు వాడి పెళ్లాం అర్థరాత్రి అపరాత్రి లేకుండా స్నానాని కని గిన్నెలు తోమడానికని ఈ పంపు కొడుతుంటారు. అందుకే మీకు గజ్జెల శబ్దం వేళాపాళా లేకుండా విన్పించడం, ఒక్కోరోజు అసలు వినిపించకపో వటం జరిగింది! నేనయితే పన్నెండున్నరకి డ్యూటీ ఎక్కితే తిరిగి నాలుగు న్నరకే ఇల్లు చేరేది. నేను కుటుంబంతో సహా పొద్దుటే వచ్చాను - ఇక భయ పడకండి సాబ్. హాయిగా ఈ ఇంట్లోనే ఉండండి. ఈ డొక్కు పంపు బాగు చేయిస్తే మీకే బాధా ఉండదు!" అన్నాడు.

ఫల్గుణరావుకి పోయిన ధైర్యం యధాతథంగా తిరిగొచ్చేసింది. మన సులో ఎలాంటి సంకోచాలు లేకుండా హాయిగా ఇంట్లోకి వెళ్లి తలుపేసుకుని తన గదిలో అదమరిచి నిద్రపోయాడు... ఇల్లు అమ్మే ప్రయత్నం నుండి వెనక్కు మరలాడని ఇక వేరే చెప్పాలా మీకు!

★



## ఆల్ ది బెస్ట్!

బెంగాలీ భామ కమలినీ ముఖర్జీ ఇప్పటి దాకా తెలుగు, తమిళంలోనే నటించింది. ఇప్పుడు మలయాళ తెరపై కూడా కనిపించబోతోంది. నట నకు అవకాశం వుండే పాత్రట ఇది. హీరోగా మమ్ముట్టి నటిస్తున్నాడు. అంత టాప్ హీరోకి జోడీగా తొలి సినిమాలోనే మలయాళంలోకి అడుగు పెడుతున్న కమలినీ ముఖర్జీ తనకి ఇక్కడ మంచి సక్సెస్ లభిస్తుందనే ఆశా భావంతో వుందిట. ఆల్ ది బెస్ట్ చెబుదాం!

